జిందగీ

# చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్

సోమవారం 23 సెప్టెంబర్ 2024

www.ntnews.com


11


కథాసుధ

## కలవరం పెట్టే కోరిక

ఓ రాజుకు రాత్రివేళల్లో తన రాజ్యం ఎలా ఉంటుందో చూడాలనిపించింది. అందుకని ఒకమంచి చలి కాలం రాత్రి ఓ వీధిలో నడుస్తూ ఉన్నాడు. అప్పుడు రాజుకు ఓ వృద్ధుడు ఇంటి ముందు చొక్కా వేసుకోకుండా పడుకుని ఉండటం కనిపించింది. దుప్పటి కూడా కప్పుకోకుండా అంత చలిలో అతను పడుకుని ఉండటం చూసి రాజు ఆశ్చర్యపోయాడు.'వణుకు' ఛాయలు ఆ వృద్ధుడి ముఖంలో కానీ, శరీరంలో కానీ ఎక్కడా కనిపించలేదు.
'నీకు చలి వేయడంలేదా?' అడిగాడు రాజు.
'అనిపించడం లేదు' బదులిచ్చాడు ఆ వృద్ధుడు.
'గడ్డ కట్టేంత తీవ్రమైన ఈ చలిలో దుప్పటి కప్పుకోకుండా పడుకోవడం మంచిది కాదు, నేను రేపు నీకొక దుప్పటి తెచ్చి ఇస్తాను. ఎముకలు కొరికే చలి బారినుంచి తప్పించుకోవచ్చు!' అని చెప్పి రాజు తన మందిరానికి వెళ్లిపోయాడు.
మర్నాడు తన పనుల హడావుడిలోపడి రాజు వృద్ధుడి విషయమే మరిచిపోయాడు. రెండు రోజుల తర్వాత రాజుకు ఆ వృద్ధుడి సంగతి గుర్తుకువచ్చింది. ఆ రోజు రాత్రి దుప్పటి తీసుకొని వృద్ధుడి దగ్గరికి వెళ్లాడు. వృద్ధుడి శరీరం సగానికి సగం కుంచించుకుపోయింది. చలికి అతను తీవ్రంగా వణికిపోతూ కనిపించాడు. రాజు అందించేలోగా దుప్పటిని లాక్కొని గబగబా కప్పుకొన్నాడు వృద్ధుడు.
దిగ్భ్రాంతి చెందిన రాజు 'ఆ రోజు నేను నీ దగ్గరికి వచ్చినప్పుడు చలే లేదన్నావు, ఈరోజు దుప్పటి కోసం ఇంతలా వెంపర్లాడుతున్నావు కారణమేంటి?' అని అడిగాడు.
'రాజా మీరు నాకు దుప్పటి ఇస్తాననేంత వరకు నాకు ఆ స్పృహే లేదు. మీరు చలి, దుప్పటి గురించి చెప్పినప్పటి నుంచీ నాలో అవే ఆలోచనలు మొదలయ్యాయి. చలికి గజగజ వణకడం మొదలైంది. దుప్పటి మీద కలవరం పుట్టింది' అని సమాధానమిచ్చాడు.
'కోరికలు ఉంటే కంటి మీద కునుకు ఉండదు. కోరికలు లేకపోతే జగత్తు సైతం తృణప్రాయం' అని పండితులు చెప్పింది గుర్తుకు వచ్చింది రాజుకు. చిన్నగా అక్కడి నుంచి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821





గీతాసారం

# బంధనాల నుంచి విముక్తి వైపు..

నత్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్!
(భగవద్గీత 2-12)

'అర్జునా! నీవు, నేను, కనిపించే రాజులు.. మనమంతా గతకాలంలో ఉన్నాం.. భవిష్యత్తులోనూ ఉంటాం. అన్ని కాలాల్లోనూ ఉండే 'నేను' అనే 'ఆత్మ' శరీర పతనంతో నశించేది కాదు. ఈ సృష్టిలో ఉన్నది నశించదు. లేనిది కొత్తగా పుట్టదు' అని చెబున్నాడు శ్రీకృష్ణుడు. శిశిరంలో మోడువారిన వృక్షాలు వసంతంలో చిగురిస్తాయి. వసంతంలో చిగురించిన వృక్షాలు శిశిరంలో మోడువారుతాయి.
సృష్టిలో 'పదార్థం' ఉన్నప్పుడు దానికి 'వ్యతిరేక పదార్థం' కూడా ఉంటుంది. 'సకారాత్మక' సంఖ్య ఉంటే 'నకారాత్మక' సంఖ్య ఉంటుంది. అలాగే జనన మరణాల పేరుతో మార్పుచెందే శరీరం ఉన్నప్పుడు దానికి అతీతమై, మారనిది ఒకటి ఉంటుంది. అదే ఆత్మ!

జనన మరణాలతో సంబంధం లేకుండా ప్రతివ్యక్తిలో ఒక కేంద్రం ఉంటుంది. అది స్వచ్ఛమైనది.. శాశ్వతమైనది. దానినే పారమాత్మిక తత్త్వం అంటాం. అయితే మనలో చాలామంది జీవన కేంద్రంపై కాకుండా పైపై అంచులనే చూస్తూ జననమరణాలనే భ్రమలో బాధపడుతున్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే.. జగత్తంతా రెండు విధాలుగా కనిపిస్తుంది. మొదటిది ఆకారాలు, పేర్లు, రంగులు, పరిమాణాలు, అది ఉండే కాలం లాంటివి. రెండోది.. వాటిలో పల ఉండే వస్తువు లేదా దేనితో అది తయారు అవుతుందో అట్టి వస్తువు. ఉదాహరణకు మట్టితో కుండలను చేస్తాం. కుండ అనేది ఆకారం, పేరు, పరిమాణాలను బట్టి గుర్తిస్తున్నాం. కానీ, దానికి ఆధారమైనది మట్టే! కుండగా మారనంత వరకది మట్టి మాత్రమే! కుండ బద్దలయ్యాకా మళ్లీ మట్టే. కుండగా మారాక.. ఆ మట్టికి, జననం మరణం కాని కుండకు ఆధారమైన మట్టికి ఆ బద్దలవడం అనేది ఉండదు.

ప్రతివ్యక్తిలో 'విజ్ఞాన' పార్శ్వం ఉంటుంది. అలాగే 'అజ్ఞాన' పార్శ్వమూ ఉంటుంది. మన సహజస్థితి ఆనందమని జ్ఞానం చెబుతుంది. అయితే ఆనందం మనలోనే ఉన్నదనే సత్యాన్ని గుర్తించక, సౌకర్యంగా ఉన్నదనే భ్రాంతిలో అజ్ఞానాన్ని ఆదరిస్తూ.. మాయ, అహంకారం అనే ముసుగులను కప్పుకొని ఆనందాన్ని విస్మరిస్తున్నాం. మనమంతా జీవితాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నామా? ఆలోచించాలి. విషయాన్ని లోతుగా తరచి చూస్తేనే ఆనందాన్ని ఆస్వాదించ గలుగుతాం. చిత్రకారుడు ఒక చిత్తరువును చిత్రించే సమయంలో పలు కోణాలలో దర్శిస్తాడు.. పరిశీలిస్తాడు. దానికి సంబంధించిన వివిధ స్పందనలను ఆస్వాదిస్తాడు. ఆనందానికి అతీతమైన తన్మయస్థితిలో చిత్రించిన చిత్రం ఉదాత్తతను సంతరించుకుంటుంది. సాధారణ వ్యక్తి దృష్టికీ చిత్రకారుని దృష్టికీ భేదం ఉంటుంది.

ఒకరొక కార్యాన్ని సాధించారంటే దానిని ఎవరైనా సాధించగలరు. అయితే కార్యాన్ని ఆరంభించిన సమయంలో నేను అల్పుడనని దిగాలుపడినా, నా స్థితిగతులు కార్యసాధనకు సరిపోవని అధైర్యపడినా.. కార్యం విఘ్నమౌతుంది. తానెన్నడూ నశింపనని, తనకు ఇతరులకు భేదం లేదని తెలిసాక.. ఉత్సాహం కలుగుతుంది. ఉత్సాహం ధైర్యానికి ఊపిరులూదితే సాహసం ముందుకు వస్తుంది. బుద్ధి ప్రచోదన జరిగితే ఆత్మ విశ్వాసం వెలుగు చూస్తుంది. దానికి ప్రయత్నం తోడైతే కార్యం సాధ్యమవుతుంది. కార్యసాధన ఆనందాన్నిస్తుంది. కృష్ణుడీ చిన్న ధర్మసూక్ష్మాన్ని ఆధారం చేసుకొని అర్జునుడి ఎదలో ధైర్యాన్ని నింపి కార్యోన్ముఖుని చేశాడు. మనందరమూ మరణరహిత ఆనంద స్వరూపులమని, తెలిసి కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, మనది కాని భయాన్ని ఆశ్రయించి జీవితాన్ని నిర్వీర్యం చేసుకోకూడదు. భయం పరిమితులను దాటిన వారే విజయ సాధకులుగా చరిత్రలో నిలుస్తారు.

... పాలకుర్తి రామమూర్తి

క్రీస్తు సందేశం

## దేవుడు మాట్లాడతాడా?

ఔను ఇది సాధ్యమే! దేవుడు మాట్లాడతాడు. దేవుడు కనబడడు కదా మరి ఆయన మాట్లాడతాడు అని కోరుకోవడం అనౌచిత్యం కాదా, అదెలా సాధ్యం? దేవుడు మాట్లాడడని, అది బైబిలు ద్వారా పలికాడనీ, బైబిలును ఆయన వాక్కుగా భావిస్తుంది క్రైస్తవం. కొండల మాటునుంచి, పొదల చాటు నుంచి, మేఘాల తెరల నుంచి దేవుడు తన స్వరాన్ని వినిపించాడు. మోషేకు పది ఆజ్ఞలు అందించిన దేవుడు. తన బలమైన స్వరాన్ని ప్రపంచానికి గట్టిగా వినిపించాడు. అది ఆది క్రైస్తవ్యానికి ఓ ప్రేమ పునాది వాక్యంగా, సేవా వారధిగా నిలిచిపోయింది. బాధల్లో ఉన్నవారికి ఎవరో ఓ పెద్దాయన పెద్ద మనసుతో సాయపడినప్పుడు 'దేవుడిలా వచ్చి కాపాడాడు' అని అంటారు. తనకు న్యాయం జరిగినప్పుడో, ఒక మోసగాడికి నష్టం జరిగినపుడో 'దేవుడున్నాడు' అని గట్టిగా నినదిస్తారు. సాధారణ స్థితి నుంచి మహోన్నతుడైన దేవుని స్థానం దాకా తాను చేసే సత్క్రియల ద్వారా మనిషి ఎదుగుతాడు అనే నీతిని అందించే సంఘటనలూ, సిద్ధాంతాలూ చాలానే ఉన్నాయి. మరో మనిషి రూపంలో వచ్చి దేవుడు సాయపడగలడంటే కూడా ఇదే పరమార్థం. దేవుడు ప్రేమమయుడు. అదే ప్రేమతో ప్రతివ్యక్తీ దేవుడిలా మారడానికి, దేవుడు అయిపోవడానికి.. దైవపీఠానికి పోటీ పడితే ప్రపంచమంతా దైవమయమై, ప్రేమమయమైపోదా? ప్రభువు ప్రాణత్యాగం ద్వారా మనతో దేవుడు చాలా మాట్లాడాడు. క్రీస్తు పరలోకం నుంచి మానవ లోకానికి వచ్చింది తన మహిమను ప్రకటించుకోడానికి కాదు, మనిషిని కూడా దేవునిగా మార్చేయడానికే!

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024





## చెట్టు మీది పక్షి

ఓ చెట్టు మీద ఎంతో అందమైన పక్షి ఉంది. అది శాశ్వత సత్యమైన భగవంతుడనే పండును పొడుచుకుని తింటున్నది. భగవన్నామ స్మరణం అనే రసాన్ని తాగి ఆనందిస్తున్నది. దానికి ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఎగరాలనే కోరిక లేదు. తాను ఉన్నచోటనే తృప్తి చెందుతున్నది. అలాంటి పక్షికి ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఎగరడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అలా ఎగురుతూ ఉంటే ఏదో ఒకనాటికి దాని శక్తి ఉడిగిపోతుంది. చివరికి ఎగరడం అనేది దుర్భరంగా మారిపోతుంది. కాబట్టి, ఆ పక్షి భగవంతుడనే మధురఫలం ఉన్న చెట్టునే ఆశ్రయించుకుని ఉండాలి. ఆ చెట్టు ఆకులు ఎన్నటికీ రాలిపోవు; పైగా దాని కొమ్మలు ఎప్పుడూ తాజా పండ్లతో నిండి ఉంటాయి.

• గురు అమర్‌దాస్ (సిక్కుల మూడో గురువు)

ఇస్లాం బోధ

## నైతికతే నిజమైన స్వేచ్ఛ!

చూపుల్లో సిగ్గు, బిడియాలు ఉట్టిపడాలి. లజ్జ అనే కాటుక కళ్లలో ప్రతిబింబించాలి. చూపుల బిడియం మనిషికి అత్యంత విలువైన ఆభరణం. చెడు చూపు వ్యక్తిత్వాన్ని దిగజారుస్తుంది. చూపులను కిందికి వాల్చి ఉంచడం వల్లనే మన హృదయాలు కాంతిరేఖలు అవుతాయి. ఎవరి చూపులైతే కిందికి వాలి ఉంటాయో అలాంటి వారిని ఏ శక్తీ అపమార్గం పట్టించలేదు. అలాంటి వారిని ఎలాంటి ప్రలోభాలు లొంగదీసుకోలేవు అనడానికి నిదర్శనమే ఈ సంఘటన.
ఒకానొకప్పుడు ఉమేర్ బిన్ హబీబీ.. రోమ్‌లో బానిసగా పట్టుబడ్డారు. ఈయన ఆరడుగుల అందగాడు. ఆయన అందచందాలకు ముగ్ధుడైన రోమ్ సర్దారు ఆ యువకుణ్ని లొంగదీసుకునేందుకు ఒక వ్యూహం పన్నాడు. ఒక అందమైన మహలును సిద్ధం చేశాడు. ఆ యువకుణ్ని అందులో బంధించి విలువైన మద్యం, రుచికరమైన మాంసాహారం, అందమైన యువతిని ఏర్పాటుచేశాడు. ఆ యువతి హబీబీని 'నీ కోరిక తీర్చుకో!' అన్నట్టుగా రెచ్చగొట్టసాగింది. హబీబీ దించిన తల ఎత్తలేదు. ఇలా మూడురోజులు, మూడు రాత్రులు గడిచాయి. తిండి తిప్పలు లేవు. మూడు రోజుల తర్వాత ఆ యువతి 'మూడు రోజులుగా ఏమీ తినకుండా ఎందుకింత మొండికేసి కూర్చున్నావు. కనీసం తల ఎత్తి కూడా చూడటం లేదు! అసలు నువ్వెవరు? ఇంత మంచి అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకుంటున్నావు?' అని ప్రశ్నించింది. దానికి హబీబీ 'నా దేవుడు నన్ను ప్రతిక్షణం చూస్తున్నాడు. నేను ఈ పాడు పని చేసేందుకు సిగ్గుపడుతున్నాను. మూడు రోజులు కాదు ముప్పయ్ రోజులు నువ్విలా నా ముందు కూర్చున్నా నేను ఈ పాడు పని చేయలేను. ఎందుకంటే నా యవ్వనం అల్లాహ్ అప్పగింత. దానిపై మచ్చరానివ్వలేను' అన్న మాటలకు ఆ యువతి విస్తుపోయింది. 'నీలాంటి ఆణిముత్యాన్ని నేను చూస్తూ చూస్తూ చంపుకోలేను. నేను ఎలాగైనా నిన్ను ఇక్కడినుంచి బయటపడేస్తాను' అని చెప్పి అక్కడినుంచి బయటికి వచ్చింది. ఆ రోజు రాత్రి ఆ యువకుడిని అక్కడినుంచి తప్పించింది.
ఇదీ వ్యక్తిత్వమంటే. పరిస్థితులు ఎంతలా ప్రలోభపెట్టినా మన వ్యక్తిత్వాన్ని, మన చూపులు పక్కదారి పట్టరాదు. 'నువ్వు నీ యవ్వనాన్ని ఎలా గడిపావు' అన్నది ప్రళయ దినాన అల్లాహ్ అడిగే ఐదు ప్రశ్నల్లో ఒకటి. అందుకే యవ్వన జీవితాన్ని ఎలాంటి మచ్చలేకుండా గడపాలని చెబుతారు పెద్దలు.



లజ్జ, సిగ్గు, బిడియం ఇవన్నీ ఇస్లామ్ ధర్మం నైతిక ఆభరణాలని ప్రవక్త చెప్పారు. 'ఇస్లామ్ ధర్మమనే వృక్షానికి 60కి పైగా కొమ్మలున్నాయి. వ్రీడ (లజ్జ) కూడా విశ్వాసానికి ఒక కొమ్మే' అనేవారు అందుకే ప్రవక్త (సఅసం). మహాప్రవక్త కాలంలో ఒక వ్యక్తి ఎంతో బిడియస్తుడిగా ఉండేవాడు. దానికి అతని సోదరుడు అతనిపై మండిపడేవాడు. ఇది గమనించిన దైవప్రవక్త (స), 'అతణ్ని కోపగించుకోకు. ఎందుకంటే సిగ్గుపడటం విశ్వాసంలో అంతర్భాగం' అని ప్రబోధించారు. ఇస్లామ్ ధర్మం అన్ని రకాల నీతి బాహ్యమైన పనుల నుంచి, దుర్గుణాల నుండి దూరంగా ఉండమని వారిస్తుంది. మనిషిలో సహజంగా ఉండే ఈ సిగ్గు, బిడియాలు మనిషిని అన్ని రకాల చెడులకు దూరంగా ఉంచుతాయి. లజ్జా గుణం మనిషికి ఆభరణం లాంటిదని, దీనివల్ల మనిషికి మేలు మాత్రమే కలుగుతుందని ప్రవక్త హితవుపలికారు. సిగ్గు, బిడియాలు వదిలేసిన నైతికత లేని స్వేచ్ఛ విశృంఖలతకు దారితీస్తుంది. నైతికతే నిజమైన స్వేచ్ఛకు పునాది అని ఉలేమాలు చెబుతారు!

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

హైందవ సంస్కృతిలో అన్ని పండుగలకూ ప్రత్యేకత కనిపిస్తుంది. ప్రతీ పర్వం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకొని ఉంటుంది. భాద్రపద కృష్ణ పక్షంలో వచ్చే మహాలయ పక్షాలు కూడా అలాంటివే! ఈ పక్షం రోజులు పితరులను తలచుకోవాలని శాస్త్రం నిర్దేశించింది. అన్ని వర్గాల వారు తమ పెద్దలు మరణించిన తిథుల్లో తర్పణ, శ్రాద్ధకర్మలు ఆచరించాలని సూచించింది.



సందర్భం

# పితరులను తలుచుకుందాం!

ఉత్తరాయణం దేవతల కాలమనీ, దక్షిణాయనం పితృకాలమని శాస్త్ర వచనం. ఆషాఢ మాసం కృష్ణ పక్షం మొదలు ఐదో పక్షం అంటే భాద్రపదం కృష్ణ పక్షం వరకు పితరులు చాలా కష్టపడుతూ, అన్నోదకాలు కాంక్షిస్తూ ఉంటారట. వారి క్షుద్బాధ తీర్చడానికి మహాలయ పక్షం అనువైన సమయంగా పేర్కొన్నారు. మహాలయ పక్షంలో 'దివే దివే గయాతుల్యమ్' అంటే ప్రతి రోజూ తర్పణం గానీ, పితరులు దూరమైన పుణ్యతిథి నాడు శ్రాద్ధం గానీ నిర్వహించినట్టయితే పితృదేవతలు సంవత్సరం వరకు సంతృప్తులు అవుతారని స్కాందపురాణం చెబుతున్నది. కన్య, తుల రాశుల్లో సూర్యుడు సంచరించే సమయంలో ప్రేతపురి శూన్యంగా ఉంటుందనీ, పితృదేవతలు అన్నం కోరుతూ వారి వారసుల ఇండ్ల చుట్టూ తిరుగుతారని మహాభారతంలో ఉటంకించారు. మహాలయ పక్షాల్లో తమ వారసులు శ్రాద్ధకర్మలు ఆచరిస్తారని కొండంత ఆశతో ఉంటారట. వారసులు తమ యథాశక్తి శ్రద్ధగా శ్రాద్ధకర్మ ఆచరిస్తే పితరులు సంతోషించి తమ లోకాలకు వెళ్తారట. లేనిపక్షంలో వృశ్చికమాసం తర్వాత దేవతలతో సహా నిట్టూర్చి, శాపమిచ్చి తిరుగు ప్రయాణం అవుతారట.

మరణించిన వ్యక్తి తిథి నాడు తద్దినం పెట్టడం హిందూ సంప్రదాయంలో అనాదిగా వస్తున్న ఆచారం. తండ్రి మరణించిన తిథినాడు కొడుకు తన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకొని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు. మరి పుత్రులు లేనివారి సంగతేమిటి? వారి కోసం శాస్త్రం ఓ మార్గాన్ని నిర్దేశించింది. కుటుంబాలలో ఏ కారణం చేతనో పెళ్లికాని సోదరి, సోదరులు మరణించి ఉండవచ్చు. పెళ్లయినా.. సంతానం లేక మరణించిన దంపతులూ ఉండవచ్చు. ప్రమాదాల్లో మరణించిన చిన్నపిల్లలు, యుద్ధాలలో ప్రాణాలు వదిలిన వాళ్లు, ఆత్మహత్య చేసుకున్నవాళ్లు, ప్రకృతి వైపరీత్యాల్లో కన్ను మూసిన వాళ్లు ఉండవచ్చు. అటువంటి వారికి తిలోదకాలు ఇచ్చి.. వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం నిర్దేశించినవే మహాలయపక్షాలు.

- భాద్రపద బహుళ పక్షాన్ని మహాలయ పక్షమనీ, పితృపక్షమనీ అంటారు. భాద్రపద అమావాస్యను మహాలయ అమావాస్య అంటారు. మన రాష్ట్రంలో పెత్తులమాస అని పిలుస్తారు. పితృదేవతల అమావాస్య వాడుకలో పెత్తులమాస అయిందన్నమాట.
- క్రమం తప్పకుండా తద్దినాలు పెట్టేవారు కూడా పితృపక్షాల్లో ఆయా తిథులలో పితృకార్యాన్ని నిర్వహించాలి. మరణించిన వ్యక్తుల తిథి తెలియనివారు అమావాస్య నాడు పితృకార్యాన్ని నిర్వహించాలి. తండ్రి జీవించి ఉండి తల్లి మాత్రమే మరణించిన వారు భాద్రపద బహుళ నవమినాడు శ్రాద్ధ విధిని నిర్వహించాలి.
- వంశాచారంలో అగ్నిహోత్రం ఉన్నవారు స్వధాకారంతో అగ్నిహోత్రుడికి కవ్యములు సమర్పించాలి. అగ్నిదేవుడికి స్వాహాదేవి, స్వధాదేవి అని ఇద్దరు భార్యలు. అగ్నిదేవుడు స్వాహాదేవి సాయంతో స్వీకరించి దేవతలకు అందించే ఆహుతులను హవ్యములు అంటారు. స్వధాదేవి సాయంతో స్వీకరించి పితృదేవతలకు సమర్పించే ఆహుతులను కవ్యములు అంటారు. మిగిలిన పితృకార్యం అందరికీ సమానమే.

> ### సర్వ కారుణ్యం..
> కాలం చేసిన వంశస్థులతోపాటు, పుత్రులు లేని గురువులకు, స్నేహితులకు కూడా మహాలయ పక్షాల్లో తిలోదకాలతో పిండప్రదానం చేసే అర్హత, అధికారం కర్తకు ఉంటుంది. దీనినే సర్వ కారుణ్య తర్పణ విధి అంటారు. ఏ కారణంతో నైనా... తద్దినం పెట్టకపోతే.. ఆ దోషం మహాలయ పక్షాల్లో పితృవిధి నిర్వర్తిస్తే తొలగిపోతుందంటారు. ఈ పక్షాల్లో పితృదేవతలు ఆశతో తమ వారసుని ఇంటిని ఆవహించి ఉంటారని నమ్ముతారు. పితృవిధి నిర్వర్తించిన వారసుడిని మనసారా ఆశీర్వదించి, పిల్లాపాపలతో సంతోషంగా జీవించమని దీవిస్తారట.

- వైదిక విధానం వర్తించని వంశాల వారు తమ పూర్వికులను స్మరించుకొని బ్రాహ్మణులకు ఆహార పదార్థాలను, సంభావనను సమర్పిస్తే సరిపోతుంది.
- పితృకార్యాన్ని కర్త నివాసం ఉన్న ఇంట్లో నిర్వహించడమే పితృదేవతలకు ఆనందాన్ని ఇస్తుంది. ఆ ఇంటి కోడండ్లు వండి, వడ్డిస్తే భోక్తలను ఆవహించిన పితృదేవతలకు, విశ్వేదేవతలకు పరమానందం కలుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే మఠాలలో శ్రాద్ధకర్మను నిర్వహించాలి.
- దక్షిణాయనం పితృదేవతలకు సంతోషాన్నిచ్చే కాలమైతే, భాద్రపద బహుళ పక్షం వారికి మరింత ఆనందాన్ని ఇచ్చే సమయం. పితృదేవతలకు సంతోషాన్ని కలుగజేద్దాం. మన సంతానానికి మరిన్ని సుఖసంతోషాలను అందిద్దాం.

... శ్రీవర్ధన్

## జీవేశ్వరులు పరబ్రహ్మమే

సత్యం జ్ఞానమనంతం యద్బ్రహ్మ తద్వస్తు తస్యతత్|
ఈశ్వరత్వం జీవత్వముపాధిద్వయ కల్పితం|| అంటుంది వేదాంత పంచదశి. సత్యం, జ్ఞానం, అనంతం అనే లక్షణాలతో పేర్కొన్న పరబ్రహ్మం ఏది కలదో అదే వస్తువు (పరమార్థం). ఆ పరబ్రహ్మం ఈశ్వరత్వం, జీవత్వం అనే రెండు ఉపాధులు కలిగి ఉంటుంది.
ప్రపంచం ఏర్పడేందుకు మూలకారణమైన ప్రకృతి త్రిగుణాత్మకమైంది. అంటే సత్వ, రజస్తమో గుణాలు కలది. జ్ఞానం, స్వచ్ఛత, శాంతి మొదలైన వృత్తులకు సత్వగుణం, కామం, క్రోధం మొదలైన వాటికి రజోగుణం, అలాగే మూఢత్వం, సోమరితనం మొదలైన వృత్తులకు తమోగుణాలు కారణాలు. శుద్ధ సత్త్వం అంటే రజస్తమో గుణాల కలయిక లేని నిర్మలమైన సత్వగుణమే 'మాయ'. ఈ మాయాశక్తి ఉపాధిగా కలవాడు ఈశ్వరుడు. ఇతడు సర్వనియామకుడు. సర్వజ్ఞుడు, శాసకుడు. మాయను అధీనంలో ఉంచుకొని ప్రపంచకార్యాలు నిర్వహించువాడు. మలిన సత్త్వం అంటే రజస్తమో గుణాల కలయిక కలిగినది. అవిద్య, అజ్ఞానం. వీటిని ఉపాధిగా కలవాడు జీవుడు. మాయకు వశుడు. మాయలో ప్రతిబింబించిన బ్రహ్మం ఈశ్వరుడు అయితే, అవిద్యలో ప్రతిబింబించే బ్రహ్మం జీవుడు. ఈ విధంగా ఒకే పరబ్రహ్మం ఉపాధి భేదం కారణంగా ఈశ్వరునిగా, జీవునిగా ఉన్నాడు.



... శివకుమార్